క్లుప్తంగా

కళాకారుడికి సన్మానం



కొత్తకోట: ఇటీవల పశ్చిమాద్రి సంస్థాన విరక్త మఠం నుంచి బసవ పురస్కారం అందుకున్న బైరోజు చంద్రశేఖర్‌ను బుధవారం జెడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న వారికి పురస్కారాలు అందజేయడం వల్ల వారిలో నూతన ఉత్సాహం వస్తుందన్నారు. బైరోజు చంద్రశేఖర్ సాహితీవేత్తగా, శిల్పిగా, వ్యాఖ్యాతగా మూడు దశాబ్దాలకు పైగా తన ప్రత్యేకతను కనబరుస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు రమేష్‌బాబు, సాహితి కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, అడ్వకేట్ మోహన్‌కుమార్, శ్రీనివాసరావు, మధుగౌడ్, బండారు శ్రీనువాసులు, గాయకులు శివలింగం పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పాన్‌గల్: మండలంలోని కదిరెపాడు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సత్యం తండ్రి పగిడాల బాల్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బుధవారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాముయాదవ్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్య నాయుడు, జ్యోతినందన్‌రెడ్డి, రామకృష్ణ, సర్పంచ్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

పీహెచ్‌డీ స్కాలర్‌కు ల్యాప్‌టాప్ బహూకరణ



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాలకు చెందిన బత్తిని మద్దిలేటి ఉస్మానియా యూనివర్సిటీలో తత్వశాస్త్రంలో శైవిజం, నాయనార్లపై తాత్విక పరిశోధన చేస్తున్నాడు. అతడికి ఆర్థిక పరిస్థితులు లేకపోవడంతో సర్పంచ్ నిర్మల విషయాన్ని మంత్రి మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి బుధవారం వనపర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.50 వేల విలువ గల ల్యాప్‌టాప్‌ను మద్దిలేటికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి, స్థానిక నాయకులకు బత్తిని మద్దిలేటి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాధాకృష్ణ , పృథ్వీరాజు, కురుమయ్య, వెంకటేష్, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

జేపీఎస్‌ల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి



వనపర్తి: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించి, 010 పద్దు ప్రకారం.. వేతనాలు ఇవ్వాలని తెలంగాణ ప్రజల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్‌గుప్తా డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ధర్నాచౌక్‌లో చేపట్టిన జేపీఎస్ నిరసన దీక్ష కార్యక్రమానికి బుధవారం ఐదోరోజు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు, పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు, పారిశుద్ధ్య నివారణలో కీలకపాత్ర పోషించిన వారిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జేపీఎస్‌ల డిమాండ్లను పరిష్కరించి గ్రామ పాలనను దారిపెట్టాలన్నారు.

‘కంటివెలుగు’ శిబిరం

పెబ్బేరు రూరల్: అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి రాముడు కోరారు. బుధవారం శ్రీరంగాపురం పట్టణ కేంద్రంలో నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమంలో 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య అధికారి పవన్‌కుమార్, ప్రియాంక, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

‘ఆధార్’ అప్‌డేట్ తప్పనిసరి



అన్నారంతండాలో ఆధార్ అప్‌డేషన్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్

అమరచింత: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి, తహసీల్దార్ చాంద్‌పాషా, కమిషనర్ మహమ్మద్ ఖాజా అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈమేరకు వారు మాట్లాడుతూ ఆధార్ కార్డు తీసుకొని పదేళ్లు దాటిన వారికి అప్పట్లో ఉన్న ముఖ కవలికలు, అడ్రస్‌లు గుర్తుపట్టలేని స్థితితో ఉన్నాయన్నారు. దీంతో పాటు రాష్ట్ర విభజన జరిగిన చాలా మంది ఇంకా ఉమ్మడి రాష్ట్రంలో తీసుకున్న ఆధార్ కార్డులను కలిగి ఉన్నాయని, ప్రస్తుతం వాటిని పూర్తి స్థాయిలో మార్చేందుకు గాను ఆధార్‌ను అప్‌డేడ్ చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మున్సిపాలిటీలోని పది వార్డుల్లో వార్డుకు రెండు రోజుల ప్రకారం సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పాన్‌గల్: కలెక్టర్ ఆదేశానుసారం ప్రతి జీపీలో ఏర్పాటు చేస్తున్న ఆధార్ కేంద్రాల్లో ప్రజలు తమ ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని తహసీల్దార్ చక్రపాణి అన్నారు. బుధవారం మండలంలోని అన్నారంతండాలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆధార్ అప్‌డేట్ చేసుకునే వారు ఆధార్‌కార్డుతో పాటు మరొక ఏదైనా గుర్తింపు కార్డుతో హాజరుకావాలని ఆయన సూచించారు. ఆధార్ అప్‌డేట్‌పై ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, తండా సర్పంచ్ రంగానాయక్, వీఆర్‌ఏ సురేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ అప్‌డేట్ సెంటర్‌ను బుధవారం తహసీల్దార్ మురళి ప్రారంభించారు.

వీపనగండ్ల: గ్రామాల్లోని ప్రజలు ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకునేందుకు గ్రామ పంచాయతీల్లో ఆధార్ అప్‌డేషన్ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ పాండూనాయక్, ఎంపీడీఓ కతలప్ప అన్నారు. బుధవారం బొల్లారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేషన్ క్యాంపును ఎంపీఈఓ సర్పంచ్ పద్మతో కలిసి ప్రారంభించారు. 2 నెలల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని మండలంలోని ప్రజలందరూ వినియోగించుకోవాలని వారు కోరారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అల్వాలలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని బుధవారం తహసీల్దార్ సంధ్య ప్రారంభించారు. ఆధార్‌లో గల తప్పులను సవరించుకోవడానికి మండల కేంద్రానికి వచ్చి ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. ఎంపీడీఓ అఫ్జల్, సర్పంచ్ సువర్ణ, ఉప సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

ఖిల్లాఘనపురం: ఆధార్ కార్డు పొంది పదేళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ అప్‌డేట్ చేయించుకోవాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. అల్లమాయపల్లిలో ఆధార్‌కార్డుల అప్‌డేట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



బొల్లారంలో..



అల్వాలలో..



అమరచింతలో..



శ్రీరంగాపురంలో..

సైబర్ నేరాలతో అప్రమత్తం



అమరచింత: సైబర్ నేరాలు, మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ జమీరుద్దీన్ అన్నారు. మండలంలోని కొంకన్‌వానిపల్లిలో బుధవారం ఎస్పీ ఆదేశానుశారం ప్రజలకు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. అపరచితులు ఎవరైనా ఫోన్‌చేసి మీ వ్యక్తిగత ఆధార్, బ్యాంక్ అకౌంట్ వివరాలు అడిగితే ఇవ్వొద్దని తెలిపారు. అదేవిధంగా మైనర్లకు వాహనాలను ఇవ్వరాదని, వాహనాలను నడుపుతూ మైనర్లు పట్టుబడితే బైక్ ఇచ్చిన వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటయ్య పాల్గొన్నారు.

తాగి వాహనాలు నడిపితే చర్యలు

ఖిల్లాఘనపురం: మద్యం తాగి వాహనాలు నడిపితే డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం రాత్రి ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతులు దళారులను ఆశ్రయించొద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

పాన్‌గల్: రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని దావాత్‌ఖాన్‌పల్లి సర్పంచ్ నాగేష్‌నాయుడు అన్నారు. బుధవారం ఆయన గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని జాప్యం చేయకుండా త్వరగా తూకం చేయాలని సిబ్బందికి సూచించారు. కొత్తపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

మాజీ ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని పూజలు



పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

అమరచింత: అమరచింత, మక్తల్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి అనారోగ్యం నుంచి తొందరగా కోలుకోవాలని పట్టణంలోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని నెలలుగా మాజీ ఎమ్మెల్యే అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కనుమరుగైన అమరచింత నియోజక వర్గంతో పాటు మక్తల్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా సేవలందించి ఈ ప్రాంత రైతుల కోసం ఎత్తిపోతల పథకాలను సాధించి పెట్టిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల అభ్యున్నతితో పాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి ఇప్పటికి ప్రజల్లో తనకంటూ చెదరని ముద్ర వేసుకున్న దయాకర్‌రెడ్డి త్వరగా కోలుకొని ప్రజల మధ్యకు రావాలంటూ అయ్యప్ప ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మోదీమనోహర్ రాజు, పట్టణ అధ్యక్షుడు గోపిరెడ్డి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం తగ్గినా రైతులకు తప్పని ఇబ్బందులు

గోపాల్‌పేట: వర్షం తగ్గినా రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. నాలుగు రోజుల నుంచి కురిసిన వర్షాలకు వరికొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా చేయలేదు. కాంటా చేసిన వరిధాన్యం తరలించేందుకు లారీలు రాలేదు. బుధవారం వర్షం తగ్గి ఎండ వచ్చినా మండల కేంద్రంలో కోదండరామ స్వామి ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంలో మొదట కొంతసేపు పనిచేసిన హమాలీలు బయట వ్యాపారస్తులకు సంబంధించిన లారీలు వచ్చాయని వాటి నుంచి వస్తువులు దింపేందుకు వెళ్లిపోయారు. హమాలీలు అంతా వెళ్లిపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఇన్ని రోజుల నుంచి వర్షం కురిసి కొనుగోళ్లు ఆగిపోతే ఇప్పుడు హమాలీలు ఇలా చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. ఇదే విషయాన్ని ఏపీఎం సావిత్రి దృష్టికి తీసుకువెళ్లగా హమాలీలు వేరే దగ్గర లారీలు రావడంతో అక్కడ పనిచేసేందుకు వెళ్లిపోయారని చెప్పారు. విషయాన్ని సర్పంచ్, తహసీల్దార్ దృష్టికి కూడా తీసుకువెళ్లానని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాలకు చెందిన కడుకుంట్ల బాలమ్మ అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకునే క్రమంలో మరణించారు. ఆస్పత్రి బిల్లులను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా, మంజూరైన రూ.50వేల చెక్కును నాగరాలలో బుధవారం సర్పంచ్ మంజుల బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు

మదనాపురం: గీత కార్మికులకు ప్రమాద బీమా ప్రకటించినందు సీఎం కేసీఆర్, అబ్కారీ శాఖ మంత్రి డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని గౌడ సంఘం మండల అధ్యక్షుడు అక్కల మహదేవన్‌గౌడ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో గౌడల అభివృద్ధికి నిరంతరం పని చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి తమ మద్దతు ఉంటుందన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా రాష్ట్ర అభివృద్ధితో పాటు కుల వృత్తులకు చేయూతనిచ్చి ఆదుకుంటున్న బీఆర్‌ఎస్ పార్టీకి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మద్దతుగా ఉంటామన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



పాన్‌గల్: హాకీ వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మాందాపూర్ సర్పంచ్ జయరాములుసాగర్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మాందాపూర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం గ్రామంలో వేసవి హాకీ శిక్షణ శిబిరం ప్రారంభించారని, ఈ శిబిరం ఈనెల చివరి వరకు కొనసాగుతుందన్నారు. సెలవులను వృథా చేయకుండా విద్యార్థులు శిక్షణను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీరామ్, పీఈటీ వెంకటస్వామి, ఎస్‌ఎంసీ చైర్మన్ రవి, కోచ్ సందీప్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



చిన్నంబావి: సీఎస్సీ హెల్త్ కేర్ అండ్ వెల్నెస్ సర్వీస్ లిమిటెడ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ మండలి కార్మికుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం మండల కేంద్రంలోని శివసాయి రత్నగిరి ఆస్పత్రిలో వనపర్తి జిల్లా లేబర్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 50 రకాల రక్త, మూత్ర పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. క్యాంప్ డైరెక్టర్ డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ లక్ష్మోజీ ఆధ్వర్యంలో సర్పంచ్ రంజిత్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్, జెడ్పీటీసీ వెంకట్రమణమ్మ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం మంజూరు చేయాలి

పెబ్బేరు: రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలకు దెబ్బతిన ప్రతి పంటకు పరిహారం ఇవ్వాలని బుధవారం తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 70 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేశారన్నారు. అకాల వర్షాలకు వరి, మామిడి, బత్తాయి, కూరగాయలు మిరప తదితర పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రూ.వేలు పెట్టుబడులు పెట్టిన రైతులు నిండా మునిగారన్నారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా నష్ట తీవ్రతను పరిశీలించి ఎకరాకు రూ.50 వేలు పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమేష్, సత్యారెడ్డి, నారాయణరెడ్డి, సత్యనారాయణ, రాజు, మహిళ రైతులు తదితరులు పాల్గొన్నారు.



వీఓఏలపై చిన్నచూపు తగదు



వనపర్తి: తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం 17 రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్న ఐకేపీ వీఓఏలపై ప్రభుత్వం చిన్నచూపు తగదని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా సమాఖ్య కార్యాలయం ఎదుట వీఓఏలు చేస్తున్న నిరసన దీక్ష కార్యక్రమానికి ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్న వీరికి నెలకు కేవలం రూ.3,900 వేతనం ఇస్తూ 30 రకాల పనులను చేయించుకుంటూ శ్రమ దోపిడీకి పాల్పడుతుందన్నారని ఆరోపించారు. అంజన్నయాదవ్, నగేష్, వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, కార్యదర్శి దేవేందర్, కోశాధికారి ఈశ్వరమ్మ, నరసింహ, అలివేల, స్వప్న పాల్గొన్నారు.

ఆలయ భూమిలో అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ సభ్యులు

పెబ్బేరు: మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట ఆలయ భూమిలో అక్రమ నిర్మాణ పనులు నిలిపివేయాలని వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ అబ్రహాంలింకన్‌కు వినతిపత్రం ఇచ్చారు. అంతకు ముందు శ్రీవేణుగోపాలస్వామి ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వేణుగోపాలస్వామి ఆలయ భూమి సర్వే నంబర్లు 225, 337, 354లలో మొత్తం 9ఎకరాల 36 గుంటల భూమి ఉండడంతో గ్రామంలోని కొందరు వ్యక్తులు భూమిని అక్రమంచి తప్పుడు ధ్రువప్రతాలతో రిజిస్ట్రేషన్ చేసుకొని గృహనిర్మాణాలు చేపడుతున్నారు. ఆలయ భూమిని ఇతరుల పేరు మీదికి ఎలా పట్టా చేశారని, అనుమతులు ఎలా ఇచ్చారని సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. అలాగే అక్రమదారుల నుంచి భూమిని జప్తు చేసుకొని వేణుగోపాలస్వామి ఆలయం పేరు మీదికి మార్చి వారిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో గ్రామంలోని నీరుపేద కుటుంబాలను గుర్తించి ఇదే ఆలయ భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగరాములు, కంచె అంజనేయులు, పరుశరాము, నాగేషు, సర్వేష్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ఎన్నారైల కృషి



వెల్టూరులో తాగునీటి సమస్యపై చర్చిస్తున్న ఎన్నారైలు, గ్రామస్థులు

చిన్నంబావి: కొన్నేళ్లుగా తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వెల్టూరు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎన్నారైలు కృషి చేస్తున్నారు. గ్రామానికి చెందిన కేఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ కొత్త కల్యాణ్ రావు ఆయన స్నేహితులు సంజయ్ తదితరులు గ్రామాన్ని సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విదేశాలలో వ్యాపారం చేసుకుంటున్న కొంత మంది స్నేహితులతో కలిసి గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాంట్లో భాగంగా బుధవారం గ్రామంలో సందర్శించామని ఎన్ఆర్ఐలు తెలిపారు. దాదాపు కృష్ణానది నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న వెల్టూరు గ్రామానికి తాగునీరు అందించడంలో భాగంగా సుమారు రూ.80 లక్షల వరకు ఖర్చు అవుతుందని, దీనికి పూర్తి చేసేందుకు ఎన్నారైల సహకారంతో ప్రణాళికలు చేస్తామన్నారు. తాగునీటి సమస్యను తీర్చేందుకు గుజరాత్‌కు చెందిన ఎన్నారై సంజయ్‌బాచ్‌పై సహకారం అందిస్తానని హామీ ఇవ్వడం తనకు, గ్రామ ప్రజలకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అలాగే మరికొంత మందితో కలిసి శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆకుల నారాయణ, ధర్మేందర్, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అమరచింత: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను వెంటనే మంజూరు చేసి వెంటనే తరగతులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ చాంద్‌పాషాకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈమేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాఘువ మాట్లాడుతూ మండలంలో ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా ప్రతి ఏడాది పదో తరగతి పూర్తి చేసిన అనంతరం సుమారు 600 మంది విద్యార్థులు ఇంటర్ చదువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్ల లేక చదువులకు స్వస్తి పలుకుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన మండలాల్లో జూనియర్ కాలేజీలను నిర్మిస్తామని పాలకులు ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేరక పోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు అవినాష్, నాయకులు చందు, నవీన్, నాగరాజు, భాను తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీలు తదితరులు

పాన్‌గల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే పౌష్టికాహార పంపిణీని పకడ్బందీగా చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాయినీ అన్నారు. బుధవారం మండలంలోని చిక్కేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికహారంను క్రమం తప్పకుండా తీసుకోవాలని, దీంతో పాటు ఆకుకూరలు, పండ్లు ఆహారంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్యులు సూచించిన ఆరోగ్య నియమాలను తప్పక పాటించాలని సూచించారు. కేంద్రాల నిర్వహణలో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాధ, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి



కిష్టగిరిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరమేశ్వర్



పిన్నంచర్లలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తి: తేమశాతం సాకుతో నిలిపిన ధాన్యం కొనుగోళ్లను వెంటనే పునఃప్రారంభించాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి పరమేశ్వరాచారి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నాయకులు, రైతులతో కలిసి వనపర్తి మండలంలోని పెద్దగూడెం, కిష్టగిరి తదితర కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. పదిహేను రోజుల క్రితం ధాన్యం తీసుకొచ్చినా.. తూకాలు చేయని ఘటనలు ఉన్నాయన్నారు. కొన్ని సెంటర్లలో తూకాలు చేసినా.. సకాలంలో లారీలను సమకూర్చకపోవటంతో అకాల వర్షానికి వడ్లు తడిసిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. తడచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, లారీల సమస్య లేకుండా చూడాలని, రైతుల బ్యాంకు ఖాతాల్లో సకాలంలో డబ్బులు పడే విధంగా చూడాలని ఆయన అధికారులను కోరారు. ఆయనతో పాటు రైతులు కృష్ణయ్య, చిన్న కురుమయ్య, వడ్డె కృష్ణయ్య, గోపాల్, రాములు, బాలస్వామి, శ్రీనివాస్, రాజు, చిట్టెన్న తదితరులు ఉన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఆత్మకూరు: అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు హరీష్‌గౌడ్, రాములు, భాజన్న డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పిన్నంచర్లలో రైతుల కల్లాలను సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో విష్ణు, రవి, బాలకృష్ణారెడ్డి, శివన్న, ఆల్తాఫ్, జగన్, శంకరమ్మ, రైతులు ఉన్నారు.